ఫైర్‌వ్యూ మెథోడిస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

మొయినాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి, క్రీడలతో శరీరదారుఢ్యం మెరుగుపడుతుందని, మొయినాబాద్ ఫైర్‌వ్యూ మెథోడిస్ట్ జిల్లా చర్చ్ డిఎస్ పిట్ట విజయరావు, కాంగ్రెస్‌పార్టీ టిపిసిసి మెంబర్ శాబాద్ దర్శన్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాల్‌లోని మెథోడిస్ట్ గ్రౌండ్‌లో ఎఫ్ఎంసి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఈస్టర్ పండుగ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఈయేడాది కూడా ఆపరంపరను కొనసాగించారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షులు డి.మహేష్, ఆర్గనైజర్స్ కె.శాంతికుమార్, డి.అంకిత్, డి.ప్రదీప్, డి.రాహుల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎస్.విజయరావు, శాబాద్ దర్శన్ హాజరయ్యారు. విన్నర్‌లు అంకిత్, సన్ని, ప్రదీప్, ఆనంద్, రిచ్చి, బన్ని, రన్నర్‌లుగా మధు, నాని, అభిషేక్, రాహుల్, వసంత్, సన్నిలకు ముఖ్యఅతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ అభినవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులుశాబాద్‌ప్రవీణ్, యూత్‌ప్రెసిడెంట్‌పూసలపరమేష్, మాజీవార్డ్‌మెంబర్‌కె.శ్రీనివాస్, డి.చంద్ర బాబు, డి, వరప్రసాద్, జి.శ్రీకాంత్, డి.శ్రీకాంత్, ఎస్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దేవాలయం నిర్మాణానికి సహకరించండి

-తహసీల్దారుకు విన్నవించుకున్న యాదవ సంఘం సభ్యులు

శంషాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న దేవాలయ నిర్మాణానికి కొందరు ఆటంకం కల్పిస్తున్నారని వారిపై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం సభ్యులు శంషాబాద్ తహసీల్దార్‌ను కోరారు. యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో అసెంషాబాద్ తహసీల్దార్ రవీందర్‌దత్‌ను సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. గ్రామస్థులు అందరూ కలిసికట్టుగా ఉంటూ దేవాలయాన్ని నిర్మిస్తున్నారని కాగా గ్రామానికి చెందిన ఒకరిద్దరు వ్యక్తులు తరచుగా పనులను ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. దేవాలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని వివరించారు. ఈ విషయమై తహసీల్దార్ జోక్యంచేసుకొని దేవాలయ నిర్మాణంలో ఆటంకాలు ఎదురు కాకుండా సహకారం అందించాలని వారు కోరారు.

అసెంబ్లీ స్పీకర్‌కు వినతిపత్రం అందజేసిన లెక్చరర్

కోట్‌పల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త;

కోట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా జూనియర్ కాలేజ్ కోసం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమ వారం అయన నివాసంలో పెద్దేముల్ జూని యర్‌కాలేజ్ లెక్చరర్‌గాపనిచేస్తున్న కుమ్మరి శ్రీని వాస్‌కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ మారుమూల గ్రామంనుంచి ఎంతోమంది విద్యా ర్థులు విద్యను అభ్యసిస్తున్నారని మా మండల కేంద్రానికి జూనియర్‌కాలేజ్ మంజురు చేయాల ని కోరడంతో వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్‌కు రెఫర్ చేయించారని శ్రీనివాస్ తెలిపారు. వారికి మండల తరపున ధన్యవాదములు తెలిపారు.

స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న లెక్చరర్

భూసమస్యలకు భూభారతితోనే పరిష్కారం

-జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

భూసమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం దొరుకుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి (భూమిహక్కుల చట్టం 2025)పై నిర్వహించిన అవగాహన సదస్సులో భాగంగా సోమవారం మహేశ్వరంలోని కాకి ఈశ్వర్‌ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈసదస్సుకు జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి సమయంలో భూముల సమస్యలు పరిష్కారంజరగక రైతులు కార్యాలయాలచుట్టూ తిరిగేవారని, రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్తచట్టం భూభారతి ద్వారా కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన అవసరంలేదని తెలిపారు. ఈచట్టంపై రైతులందరూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాలని అన్నారు. గతంలో ఆర్ఓఆర్ అప్డేషన్ చేసే అవకాశంలేదని, భూభారతిలో అప్డేట్ చేసే అవకాశం ఉందని, మొఖా మీద ఉన్న రైతు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సవరణచేసే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సక్సేషన్ విషయంలో సైతం ధరణిలో అప్డేషన్‌కు అవకాశంలేదని, భూభారతిలో చేసుకోవచ్చని చెప్పారు. సక్సేషన్, మ్యూటేషన్ కోసం దరఖాస్తుచేసుకున్న 30రోజుల్లో తహసీల్దారు విచారణచేసి మ్యూటేషన్ చేయాలని, లేకపోతే 31వరోజు ఆటోమెటిక్‌గా మ్యూటేషన్ అవుతుందన్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే విషయంలో గతంలో అసైన్మెంట్ భూములు వివాదాలు ఉంటే వాటికి ధరణిలో పరిష్కారంలేదని, భూభారతిలో టైటిల్ ఫ్లోచార్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాని ద్వారా మళ్లీ సవరణచేసి అసలు హక్కుదారులకు పట్టా ఇవ్వడం జరుగుతుందని స్పష్టంచేశారు. భూ భారతి చట్టంద్వారా 90శాతం రైతుల భూసమస్యలకు పరిష్కారం ఇక్కడే జరుగుతుందని, కేవలం 10శాతంమాత్రం ఆర్డీవోస్థాయిలో, కలెక్టర్‌స్థాయిలో ఉంటాయని చెప్పారు. రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతనచట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ సి.నారాయణరెడ్డి రైతులకు, ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, మార్కెట్‌కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం

-అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయభవనములోని సమవేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమసమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజలనుండి అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతోకలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో శాఖవారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లోపెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలనజరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ఖాళీచేయడానికి నిరాకరణ

-నిరాకరించిన వ్యక్తులపై కేసు నమోదు

శంషాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ఐదు సంవత్సరాల క్రితం భవనాన్ని విక్రయించి తిరిగి అందులోనే హోటల్‌ను నడుపుతూ ఖాళీ చేయడానికి నిరాకరించిన వారిపై ఆర్జెఐఏ పోలీసులు కేసు నమోదుచేశారు. శంషాబాద్ ఇన్స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. శంషాబాద్‌లోని సిద్ధాంతి సమీపంలో మహమ్మద్ అన్వర్, మొహమ్మద్ బాసిత్ అనేసోదరులకు 435చ.గ.లలో భవనం ఉన్నది. 2019 సంవత్సరంలో దానిని సివిబి.చారి కుటుంబ సభ్యులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఆతర్వాత అదేభవనంలో వారు హోటల్‌ను నడుపుకుంటున్నారు. మూడుసంవత్సరాల క్రితం మహమ్మద్ అన్వర్, మొహమ్మద్ బాసిత్ మధ్యన విభేదాలు రావడంతో వారి ఆస్తుల పంపకం జరిగింది. తర్వాత హోటల్ నడుపుతున్న బాసిత్ కొన్నినెలలుగా అద్దె చెల్లించడంలేదు. దీనితో చారి కుటుంబసభ్యులు ఒత్తిడితీసుకురాగా అసలు మేము మీకు ఈస్థలాన్ని అమ్మలేదు, ఇది మాదే అంటూ బుకాయించసాగారు. దీనితో బాధితుడు చారి కుటుంబసభ్యులు ఆర్జెఐఏ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ స్థలాన్ని చారి కుటుంబసభ్యులకు విక్రయించినట్లు అన్వర్ స్పష్టంగా చెబుతున్నప్పటికీ అతని సోదరుడు బాసిత్ మాత్రం తాము అమ్మలేదని బుకాయిస్తున్నాడు. దీనితో కంగుతిన్న చారి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై కేసు నమోదుచేసి విచారణ జరుపుకున్నట్లు ఇనిస్పెక్టర్ బాలరాజు తెలిపారు.

జగత్‌స్వప్న కాలనీలో దొంగతనం

-6 ఇళ్లలో చోరీ..కేసు నమోదు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

తాళంవేసి ఉన్న ఆరు ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీలకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని జగత్‌స్వప్న గేటెట్ కమ్యూనిటీ కాలనీలో 19వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు కాలనీ ప్రహరీగోడ దూకివచ్చి తాళంవేసి ఉన్న 6ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒక ఇంట్లో 16 గ్రాముల బంగారు అభరణాలను ఎత్తుకెళ్లారు. మిగతా 5ఇళ్లలో విలువైన వస్తువులు ఏమీ చోరీకాలేదని తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ప్రజలు మెచ్చిన భూభారతి అమలులోకి...!

-ఇక రెవెన్యూ అధికారులదే బాధ్యత

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ప్రజలు కోరిన భూభారతిని అధికారుల చేతిలో పెట్టామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇబ్రహీంపట్నంలో భూభారతి 2025 అవగాహన సదస్సు దరఖాస్తు ఇస్తేచాలు పైసా లేకుండా భూభారతిలో భూసమస్యలు పరిష్కారం చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధరణిలో సమస్యలకు లోనైన రైతులు, ప్రజలుకోరిన భూభారతి చట్టాన్ని మీ చేతుల్లో పెట్టామన్నారు. ధరణి మాదిరిగా భూభారతిలో తప్పులు చేస్తే శిక్షలు తప్పవని రెవెన్యూ అధికారులను మంత్రి హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాతీసుకువచ్చినతెలంగాణ భూభారతి (భూమిహక్కులచట్టం2025)పై నిర్వహించిన అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి భూభారతి చట్టంపై అంశాల వారీగా వివరించారు. గత 2020 ధరణిలోని లోపాలు, ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతిలో పొందుపరిచిన అంశాలను వివరించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ఈ భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అమలు చేసే క్రమంలో ఇబ్బందులుకలగకుండా 6000మందితో సర్వేలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రతి రైతు తన భూమి సర్వే మ్యాప్‌ను కూడా భూభారతి పట్టాదారు పాసుబుక్కులో పొందుపరచుకునే వెసులుబాటును కల్పిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల తొలగింపునకు గురైన విఆర్ఏ విఆర్వోల వ్యవస్థనుసైతం తీసుకురానున్నామన్నారు.అందుకు 10,956 రెవెన్యూగ్రామాలకు గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతాంగం మండల రెవెన్యూ అధికారులు మొదలుకొని జిల్లా కలెక్టర్ సిసిఎల్ఏ వరకుపోయినా సమస్య పరిష్కారంకాని పరిస్థితిని కల్పించిందన్నారు. నేడు ఈ రైతు అధికారుల దగ్గరికి పోవాల్సిన అవసరంలేదని త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులద్వారా అధికారులనే గ్రామాలకు పంపిస్తున్నామని గుర్తు చేశారు. ఎక్కడికక్కడ రైతు భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకుంటే చాలు పైసా ఖర్చులేకుండా రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆధార్ కార్డు మాదిరిగా భూదార్‌కార్డులను అందజేస్తామన్నారు. భూదార్‌నెంబర్ నొక్కితే తనభూమి వివరాలు పూర్తిగా కళ్ళముందు ఉంటాయన్నారు. ఆన్లైన్లో జరుగుతున్న మోసాలకు చెక్కుపెట్టేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో ఆన్లైన్ రికార్డులలో ప్రింట్ తీసి భద్రపరుస్తామన్నారు. ఈ విధానం ద్వారా తప్పులు చేసేందుకు అవకాశం లేకుండా ఉంటుందని వివరించారు. ధరణి కారణంగా పరిష్కారానికి నోచుకోని 9లక్షల 26వేల సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో సాగులో ఉన్న వారికి కూడా పాస్ బుక్కులు ఇస్తామన్నారు. తన భూ సమస్యల పరిష్కరించుకునేందుకు గత ప్రభుత్వం రైతులు మంగళసూత్రాన్ని అమ్మి కోర్టుకు ఎక్కాల్సిన పరిస్థితిని కల్పించిందన్నారు. నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రజాపాలన ప్రభుత్వం పారదర్శక విధానాలను అమలు చేస్తుందన్నారు. సిసిఎల్ ఏలోని దరఖాస్తులు గ్రామస్థాయికి వస్తాయని రైతులు అధైర్యపడొద్దని తెలిపారు. 18లక్షల ఎకరాలు పార్ట్ బిలో పెట్టారనీ, వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఆనలుగురికోసం గత ప్రభుత్వం 2020చట్టంతెస్తే, తమ కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రైతన్న కోసం తెచ్చిందన్నారు. పింక్ కలర్ వేసుకుని వచ్చినవారిది కూడా న్యాయమైన సమస్య ఉంటే భూభారతిలో తార తమ్యాలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. తప్పులు చేసే అధికారులకు శిక్షలే కాకుండా గత ప్రభుత్వంలో ధరణి పేరుతో ప్రభుత్వ అసైన్మెంట్ గౌరవ భూములను కబ్జాచేసిన ప్రతి గజాన్ని వెలికి తీస్తామని పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేస్తామన్నారు. ఈప్రాంతంలోని ఇళ్లస్థలాల సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించే కృషి చేస్తామన్నారు. ఆయన వెంట భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ధరణి అధ్యయన కమిటీ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రోడ్లు భవనాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం, గడ్డి అన్నారం మార్కెట్‌కమిటీ చైర్మన్‌లు గురునాథ రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి రెవెన్యూ అధికారులు సమితారెడ్డి తదితరులు ఉన్నారు.

భూసమస్యల శాశ్వత పరిష్కారానికే భూభారతి

-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

భూభారతి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి

ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

దీర్ఘకాలిక భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం మోమిన్ పేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగావిచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతాభావానికి తావులేకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూభారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులుచేర్పులు, సాదాబైనామాలువంటి సేవలు సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండేవిధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూభారతి రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదాబైనామాలు, పాసు పుస్తకాలలోని సమస్యలు పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ, గిరిజనప్రజల భూసమస్యలు పరిష్కరించినట్లయితే ప్రభుత్వ పథకాలైన రైతు బీమా, రైతు భరోసా ద్వారా లబ్ది పొందుతారని, ఆదిశగా పనిచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులసమస్యలు తెలుసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయల్లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 2వ తేదీ నుండి నూతనచట్టం భూభారతి పోర్టల్ ద్వారా భూసమస్యల పరిష్కారదిశగా పనిచేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాన్ని జిల్లాకలెక్టర్ సందర్శించారు. వసతిగృహంలో చేపట్టిన మరమ్మతుల పనులు కలెక్టర్ పరిశీలించారు. సామగ్రి నిల్వ గదిలో ఉన్న బియ్యాన్ని పరిశీలించి నాణ్యతపై వసతిగృహ సంక్షేమాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ మనోహర్, చక్రవర్తి, ఎంపిడిఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి...

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కల్లెక్టరేట్ సమావేశము హాలు నందు ఏర్పాటుచేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధప్రాంతాల నుండి వచ్చిన ప్రజలనుంచి 140 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ధరణికి సంబంధించిన భూసమస్యలు, భూసర్వే, గ్రామ పంచాయతీ, ఇతరశాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. మండలాలకు సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూసమస్యలపై ఫిర్యాదుల ు పరిశీలించినట్లు తెలిపారు. ఆన్లైన్ రికార్డు చెక్‌చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేసి రిపోర్ట్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భూసమస్యలఫిర్యాదుల ు సంబంధిత అధికారులకుపంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కొరతపై స్థానిక ప్రజల్లో ఆందోళన

-ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

-మున్సిపల్ తీరుతో తీవ్రమైన నీటిఎద్దడి

ఏర్ర క్వార్టర్స్‌లో నీళ్లలేక ఖాళీ బిందెలు చూపుతున్న దృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

పోచారం మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో తాగునీటి కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత విషయమై పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక నాయకులు, గ్రామస్థులు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారుల్లో చలనంలేదని ప్రజలు వాపోతున్నారు. పోచారం మున్సిపల్ కాచవాని సింగారం, కొర్రెముల, చౌదరిగూడలోని కొన్నికాలనీల్లో తాగునీటి కొరకు నిత్యం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా కాచవానిసింగారంలోని మహేశ్వర్‌నగర్‌కాలనీ, ఏర్రక్వార్టర్స్ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. తాగునీటి సమస్య గతంలోనే ఉండేదని అప్పట్లో పంచాయతీ అధికారులు, పాలకవర్గానికి ఫిర్యాదుచేస్తే వెంటనే స్పందించి నీటికొరత లేకుండా సమస్యను పరిష్కరించేవారని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాల్టీలో గ్రామం విలీనమైన తర్వాత తమ సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాచవానిసింగారంలోని ఏర్రక్వార్టర్స్ కాలనీలో గత రెండునెలలుగా తాగునీటి సరఫరాలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించడం, సుదూరంగా ఉన్న నీటి కొళాయిలను ఆశ్రయించడం, అపుడప్పుడు స్థానికనేతలు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతో కొంత ఉపశమనం పొందుతున్నా శ్వాశత నీటి సమస్య పరిష్కారం లభించడం లేదు. గత వారం రోజులుగా కాలనీకి నీటి సరఫరా లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పంచాయతీ బోరుబావుల ద్వారా నీటిని సరఫరా జరిగేది. పంచాయతీ సిబ్బంది నేడు మున్సిపల్ పరిధిలోకి రావడంతో స్థానిక నీటిసమస్యను పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు వార్డు ఆఫీసర్లను నియమించిన వారు తమ విధులను ఏమాత్రం నిర్వహించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామాల్లో చెత్త సేకరించకపోవడం, పారిశుధ్యలోపం, రోడ్లు, లైట్లు, ప్రధానంగా నీటి సమస్య ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలు నల్లా కనెక్షన్లతో నీటికొరత..

కాచవానిసింగారం పంచాయతీపాలనలో ఉండగా ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా నల్లా కనెక్షన్లు ఇచ్చారు. పాలకవర్గం ఇచ్చే కనెక్షన్లు కాకుండా ఇదే అదనుగా పంచాయతీసిబ్బంది తమ ఇష్టానుసారంగా నల్లా కనెక్షన్లు ఇవ్వడంతో లోతట్టు ప్రాంతం నుండి ఎగువభాగాన ఉన్న మహేశ్వరీనగర్ కాలనీ వాసులకు నీటిసరఫరా సక్రమంగా జరగడంలేదు. పంచాయతీ అధీనంలో ఉన్నప్పుడు చెడిపోయిన బోరుబావులను తక్షణమే మరమ్మతు చేయించి వాడుకలోకి తెచ్చేవారు. మున్సిపల్ ఏర్పాటు అయిన తర్వాత పాడైన బోర్లను రిపేరు చేయకపోవడంతో ఉన్న బోరు బావులనుండి నీరు తోడుతుండటంతో గ్రామంలో అందరికీ సరిపడా నీళ్లు రావడం లేదు. అంతేగాక నీళ్లు పుష్కలంగా వచ్చిన వారికే నిత్యం వస్తున్నాయి. రానివారికి నీళ్లు రాకపోవడంతో సమస్య జటిలమౌతుంది. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఇంకా ఎలా ఉంటుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడికాలనీలో పేదప్రజలు వందకువంద శాతం నివసిస్తుండగా వారికి కనీస వసతులైన తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు వంటి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అయినా సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. మండు వేసవిలో సహజంగానే నీటిసమస్య ఏర్పడుతోంది. అధికారులు ముందస్తుచర్యల్లో భాగంగా ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి అందుకు తగిన ఏర్పాట్లుచేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ పరిధిలోని కొర్రెముల, కాచవానిసింగారం గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉన్న ప్రజలు గగ్గోలు పెడుతున్నా మున్సిపల్

ఘాన్సీబజార్‌లో వెలగని వీధి దీపాలు

చార్మినార్,ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో వీధి దీపాలు వెలగక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.రాత్రి వేళల్లో చీకటిలో ప్రయాణం చేయాలంటనే ప్రజలు భయ పడుతున్నారు.వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని పలు మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేక పోయింది.ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని చంద్రిక ఝూలా,ఇంటి నెంబరు 21-6-401 ప్రాంతంలో గత కొంత కాలం నుంచి వీధి దీపాలు వెలగటం లేదు.వీధి దీపాలు చెడి పోవటంతో బస్తీ మొత్తం చీకటిగా ఉంది.చంద్రిక ఝూలా ప్రాంతం నుంచి హైకోర్టు,కోఠిరవాడి, షక్కర్‌కోట,ఆనందగల్లీతో పాటు పలు ప్రాంతాలకు ప్రజలు వెళుతుంటారు.రాత్రి వేళల్లో చీకటి ఉన్నందున మహిళలు బయటకు రావటానికిభయ పడుతున్నారు.బంగారం వ్యాపారానికి ఎంతగానో ప్రసిద్ధి గాంచిన ఝూలాలో వందలాది వస్త్రాలు, బంగారం ఆభరణాలు తయారు చేసే దుకాణాలు ఉన్నాయి. దుకాణాలకు బంగారం ఆభరణాలు తీసుకెళ్లె సమయంలో చీకటిలో స్వర్ణకారులు నానా అవస్థలు పడుతున్నారు.ఝూలా ప్రాంతంలో ఉన్నవస్త్రాల షాపులకువచ్చే ప్రజలు రాత్రి వేళల్లో బట్టలు ఖరీదు చేసిన తర్వాత ఝూలా నుంచి ప్రధాన రహదారికి చేరుకునే సమయంలో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ డివిజన్‌లో చెడి పోయిన వీధి దీపాలను తొలగించి కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలనిప్రజలు కోరుతున్నారు.

అగోరిని తక్షణమే అరెస్టు చేయాలి : మండలి గోపాల్

ఎస్సై మధు కుమార్ కు ఫిర్యాదు అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

యాచారం,ఏప్రిల్ 20, ప్రభాతవార్త : అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన లేడీ ఫేక్ అగోరి అలియా శ్రీనివాస్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని యాచారం మండల మాల మహానాడు అధ్యక్షులు మండలి గోపాల్ డిమాండ్ చేశారు. అగోరి వాక్యలను ఖండిస్తూ యాచారం పోలీస్ స్టేషన్ లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో ఉన్న అంబేద్కర్ అభిమానులు అందరి మనోభావాలు కించపరిచేలా అగోరి వ్యాఖ్యానించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి ఒక గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహానుభావునిపై అలా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ అగోరీపై చట్ట పరమైన తగు చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల కార్యదర్శి లకుమల్ల కృష్ణ, ఉపాధ్యక్షులు నాగటి లక్ష్మణ్, ఎం యాదగిరి మాల మహనాడు మండల నాయకులు ధనరాజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై యాచారంలో అవగాహన

యాచారం,ఏప్రిల్21, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమం పై యాచారం మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్‌లో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు తహసిల్దార్ అయ్యప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఆర్డిఓ అనంతరెడ్డి హాజరై భూభారతిపై సమగ్ర సమాచారం వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైతులు ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రెవెన్యూలో మీ పనులన్నీ సరళంగా పూర్తికానున్నట్లు భూభారతి ద్వారా అవుతుందని పేర్కొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ అందజేసిన ఎంపీడీవో నరేందర్ రెడ్డి

యాచారం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : లేబర్ ఇన్సూరెన్స్ ను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాచారం మండల ఎంపీడీవో నరేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం యాచారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ చేయించి కార్డులను ఉపాధి కూలీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే లేబర్ కార్డు ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉంటాయని అన్నారు. లేబర్ కార్డు పొందిన వారికి రెండు లక్షల బీమా సౌకర్యం ఉంటుందన్నారు. వారి పిల్లల పెళ్ళి లకు కూడా ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో లింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, ఎన్జీవో అంకిత , స్వచ్ఛంద సంస్థ బ్రహ్మం, శ్రావణి ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు

టిఆర్ఎస్ రజోత్సవ సభకు భారీగా తరలిరండి : సతీష్ రావు

కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: ఈనెల 27న వరంగల్లో జరిగే టిఆర్ఎస్ రజోత్సవ సభకు భారీగా తరలి రావాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పిలుపునిచ్చారు. కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు బి.ఆర్.ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంబిపూర్ రాజుల ఆదేశాల మేరకుమహిళా నాయకురాలు ప్రీతి ఆధ్వర్యంలో ఎర్రబెల్లి సతీష్ రావు ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్, చాలిస్ మకాన్‌లలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. చలో వరంగల్ నినాదంతో ఈ నెల 27న తెలంగాణ బాపు కే.సీ.ఆర్ అధ్యక్షతన జరగనున్న బి.ఆర్.ఎస్ పార్టీ రజతోత్సవ సభకి ప్రజలంతా పెద్ద ఎత్తున తరలి రావాలని, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎర్రబెల్లి సతీష్ రావు పిలుపునిచ్చారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి ఫిర్యాదుల వెల్లువ కొనసాగింది. జోనల్ కార్యాలయంతో పాటు శేరిలింగంపల్లి,చందానగర్, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు సర్కిళ్లఅధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాగా మొత్తం 27 వినతులు అధికారులకు అందాయి. ఇందులో భాగంగా జోనల్ కార్యాలయంలో 8,శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 11, యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో 5, చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 3 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక,పన్నుల విభాగం, ఇంజనీరింగ్ విభాగాలకు సంబందించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి, యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి,ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులు స్వీకరించారు.

అమెరికాతో భారత్ అసమాన ఒప్పందాలు ఆపకపోతే పోరాటాలకు సిద్ధం కావాలి

-వాన్స్ గో బ్యాక్ నిరసన కార్యక్రమంలో యస్ కె యం రాష్ట్ర కన్వీనర్‌ల పిలుపు

-దేశవ్యాప్త పిలుపులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

దేశవ్యాప్త పిలుపులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: వ్యవసాయం పాడి పరిశ్రమ చేపలు పట్టడంలో అమెరికాతో భారత దేశం అసమాన ఒప్పందాలు చేసుకుంటే దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి,కాంతయ్య,జడ సత్యనారాయణ, రవీందర్ గౌడ్ లు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 22,23, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి "సైమన్ గో బ్యాక్" లాగా . వాన్స్ గో బ్యాక్! భారత దేశం అమ్మకానికి లేదు! బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదం ముందు పూర్తిగా లొంగిపోవడాన్ని వ్యతిరేకిస్తూ విస్తృత స్థాయిలో నిరసనలు తెలియ చేయాలని పిలుపు నిస్తునిచ్చారు. ఆస్ట్రేలియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం, నిర్దిష్ట పరిమాణంలో కందులు,శనగపప్పు దిగుమతులపై జీరోడ్యూటీ భారతదేశం ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేసిందని, అమెరికన్ రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ, మన దేశం తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అంటే అసమానంగా ఉంటుందని అన్నారు.సుంకాలు, మార్కెట్ పరిమితులను ఎత్తివేస్తే భారతదేశానికి అమెరికా పాల ఎగుమతులు భారీగా పెరుగుతాయని ఇది పాడి రైతుల మరణానికి కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.భారతీయ పత్తి రైతులు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పుకీ సుంకాలను ఉపసంహరించుకోవడానికి చర్చలు జరపడం చాలా అసహ్యకరమైనది. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఎవరి ప్రయోజనాలను తీరుస్తున్నాయి? రాష్ట్ర ప్రభుత్వాలను లేదా పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోకుండానే అన్ని చర్చలు జరుగుతున్నాయని, ఇటువంటి ఒప్పందాలు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాల అమలుకు హామీ ఇవ్వవు అని, చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా దృఢంగా ప్రతిఘటించి, తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి నిలబడినప్పటికీ, భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను వదులుకోవాలని కోరుతుందన్నారు. ప్రొఫెసర్ హరిబండి ప్రసాదరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ ప్రతినిధి బృందం ఏప్రిల్ 21 నుండి 4 రోజులు భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వరరావు, సహాయ కార్యదర్శులు కూరపాటి రమేష్, శ్రీకాంత్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నెల బాలకృష్ణ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాగిరి ఆంజనేయులు ఆంజనేయులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ స్వాతంత్ర్యం సంగ్రామంలో కాంగ్రెస్ పోరాటాలు అమోఘం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : దేశ స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటాలు అమోఘమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలం వట్టినాగులపల్లి, బండ్లగూడ, నెక్‌నాంపూర్ గ్రామాలలో "జైబాపు జైభీమ్ జై సంవిధాన్ అభియాన్" కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నాడు దేశ స్వాతంత్ర్యం కోసమైనా నేడు తెలంగాణ సాధన కోసమైన కాంగ్రెస్ ముందుండి పోరాడిందన్నారు. కేంద్రంలో బిజెపి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను అన్ని రంగాలలో అగ్రభాగానికి చేరుస్తున్నారన్నారు. రైతులు, వృద్ధులు, నిరుద్యోగులు, మహిళలు ఇలా అన్ని రంగాల ప్రజలు కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పనులతో సంతోషపడుతున్నారన్నారు. గత సర్కారు చేసిన తప్పిదాలను పూడుస్తూ, అభివృద్ధిలో రాష్ట్రం దూసుకు పోతుంద

వట్టినాగులపల్లిలో జైబాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

న్నారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, బండ్లగూడ కార్పోరేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ గౌడ్, అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు నవీన్, నరేష్, సురేష్‌గౌడ్, నెక్‌నాంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు జితేందర్, నాయకులు శ్రీరాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి దివ్య ఔషధం కళలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : మానవాళికి శాస్త్రీయ, సంప్రదాయ, జానపద, లలితకళలు దివ్య ఔషధం వంటివని వక్తలు అన్నారు. కళలను అభ్యసిస్తూ కాపాడుకొంటూ ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో పంచమవేద నాట్యనిలయం ఆధ్వర్యంలో సంస్థ 23వ వార్షికోత్సవ వేడుకలు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. సంస్థ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్, నాట్యగురువు ఆర్.కనకదుర్గ నేతృత్వంలో సంస్థ శిష్యులు పలు అంశాలతో కావించిన సాంస్కృతిక నృత్యవిన్యాసాలు హోరెత్తించాయి. ముందుగా అంబాపరాకు దేవిపరాకు అంశంతో నృత్యప్రదర్శనలు ప్రారంభించి ఝెంఝెం తనాన; రంగపూజ; బ్రహ్మాంజలి; శివపంచాక్షరి; నమఃశివాయతే; ఇదిగో భద్రాద్రి; మేలుకొనవే శ్రీలక్ష్మి; సంచారదాదర; రుక్మిణీ ప్రవేశం; ధనశ్రీ థిల్లానా; పరమ పురుషుడు; ఎందరికో అభయమ్ము ఇచ్చుచేయి; భామాకలాపం; జగదవుచనవుల జాతర; బాలగోపాల తరంగం; ముద్దుగారే యశోద; అర్ధనారీశ్వరం చివరిగా మంగళం అంశాలను కృతి

నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులతో రాధేశ్యాం, ప్రసన్నరాణి, లక్ష్మీనారాయణ, కనకదుర్గ తదితర అతిథులు

లయబద్ధం హావభావాలను ప్రదర్శిస్తూ వీక్షకులను ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసి మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత కూచిపూడి విద్వాంసుడు గురు వేదాంతం రాధేశ్యాం, గౌరవ అతిథులు డా. ఆర్.ప్రసన్నరాణి, లంక లక్ష్మీనారాయణ, డి.మంజులరాణి తదితరులు పాల్గొని పంచమవేద నాట్యనిలయం గత 23ఏళ్లుగా గురు ఆర్.కనకదుర్గ శిక్షణలో ఎంతోమంది గొప్ప నాట్యకళాకారులుగా తీర్చిదిద్దుతూ చేస్తున్న కళాసేవను కొనియాడారు. చివరిగా నేటి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.

అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ అధికారులకు వినతి

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త

కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో గత కొంతకాలంగా అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ సోమవారం కూకట్పల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో అదేవిధంగా కూకట్పల్లి సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అధికారులకు వినతి అందిస్తూ విజ్ఞప్తి చేశారు. పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నిత్యం లక్షల లీటర్లను తోడేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బస్తీలో నీటి ఎద్దడి తలెత్తడంతో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులందరూ ఏకతాటిపైకి వచ్చి వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ గతంలో నిరసనలు సైతం చేపట్టారని గుర్తు చేశారు. ప్లాంట్ల నిర్వాహకులకు కనీసం కనువిప్పు సైతం కాకపోవడంతో సోమవారం వివిధ విభాగాల అధికారులకు పెద్ద ఎత్తున బస్తివాసులందరూ తరలి వెళ్లి చంద్రారెడ్డి సమక్షంలో వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ వినతి పత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తీ వాసులు సంక్షేమ సంఘం ఆలయ కమిటీ సంఘం ఇతర నేతలు బస్తి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మిగూడలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ

-రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్ ఏప్రిల్21,ప్రభాతవార్త : బిజెపి పాలనలో భారత రాజ్యాంగానికి తూట్లు పోడుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ పరిధిలోని లక్ష్మిగూడ ,వాంబే కాలనీలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లక్ష్మిగూడ వాంబే కాలనీ చౌరస్తాలో ఉన్నఅంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళుల ర్పించారు.అనంతం వాంబే కాలనీ చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు.ఎమ్మెల్యేప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన

అభివృద్ధిని వివరిస్తున్నారని అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, ఆప్రజస్వామిక నిర్ణయాలు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.పతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బిజెపి మోసాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ధనంజయ్ పార్టీ నాయకులు సరికొండ వెంకటేష్ ,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు,పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేసిన పోలీసులు

తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఉస్మానియా యూనివర్సిటీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్‌ను సోమవారం అక్రమ అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో బడ్జెట్ మరియు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజ్ చేయాలనీ గత సంవత్సర కాలం పాటు ప్రభుత్వం పై వివిధ రూపాలలో నిరసనలు తెలుపుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అనేక దపాలుగా ప్రభుత్వాన్కి విన్నవించుకుంటున్న యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ సమస్యని పరిష్కరించకుండా కొంతమంది అధికారులు ప్రభుత్వాన్ని తప్పు దోవపట్టిస్తూ ప్రభుత్వాన్ని బదునాం చేసే ప్రయత్నం చేస్తున్నారని అధ్యాపకులు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికి సమస్య పరిష్కరించకపోవడంతో రాష్ట్ర కోర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు అన్ని విశ్వవిద్యాలయాలలో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన కారణంగా 11 యూనివర్సిటీ లలో టెంట్ వేసి ధర్నాచేస్తున్నారు. కానీ ఉస్మానియా యూనివర్సిటీ లో కనీసం టెంట్ వేసుకోవడానికి పర్మిషన్ ఇవ్వకుండా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు నేలపై కూర్చుని టెంట్ లేకుండా ప్రజాస్వామ్యయుతంగా ధర్నా చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ ని ఉస్మానియా యూనివర్సిటీ వీసీ అక్రంగా అరెస్ట్ చేయించి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారని ఆరోపించారు. యూనివర్సిటీ టీచర్స్ పై పోలీస్ లతో ఉక్కుపాదం మోపాలని యూనివర్సిటీ వీసీ ప్రయత్నిస్తున్నారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన లో అన్యాయం జరిగినప్పుడు ఉద్యమాలు చేసుకోవచ్చని గత ప్రభుత్వం గడీల పాలన కొనసాగించారని ఇప్పటి ప్రభుత్వం ప్రజాస్వామిక పాలనలో నడుస్తుందని చెప్పుతుంటే యూనివర్సిటీ లలో మాత్రం ప్రభుత్వల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని వీసిపై పండిపడుతున్నారు. పోలీస్‌లతో నిర్బంధాలను పెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ తో చర్చించి వారి న్యాయమయినా డిమాండ్ రెగ్యులరైజేషన్ ని తక్షణమే పరిష్కరించాలని కోరుకుంటున్నామని తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ పరుశరామ్, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ పాండయ్య, డాక్టర్ కవిత, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సనత్, డాక్టర్ కృష్ణవేణితో పాటు పలువురు ఉన్నారు.

ఓ.యూ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

విఎన్ఆర్ విజెఐఈటీలో విజ్ఞానజ్యోతి సమారంభకోత్సవం ఎకచో 7.0

నిజాంపేట్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త

ప్రగతినగర్లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఎక్చచో 7.0ఎచ్ పేరిట ఆదివారం ఆంత్రప్రెనార్షిప్ ఫెస్ట్ జరిగింది. రెండు రోజుల పాటు సాగిన ఈ వేడుక ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జర్మన్ వర్సిటీ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్ వంగపండు స్థానికంగానూ, ది ఫ్యాక్టర్‌వై వ్యవస్థాపక సిఇఓ ఫిలిప్ ఆస్మస్ స్విట్జర్లాండ్ నుంచి అంతర్జాల వేదికగానూ పాల్గొన్నారు. రాజ్ వంగపండు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులకు జర్మనీలోని పరిశ్రమల్లోనూ విశ్వవిద్యాలయాల్లోనూ లఘుశిక్షణా కార్యక్రమాలు, అభినివేశ కార్యక్రమాలు వంటి వాటిలో స్వయంగా పాల్గొని అనుభవపూర్వకమైన విద్య నేరుగా లభించే అవకాశాలుంటాయని, తద్వారా అభ్యాసం ద్వారా మాత్రమే కాక ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతికత గురించి విద్యార్థులకు అవగాహన కలుగుతుందని వివరించారు. విజ్ఞానజ్యోతి సంస్థ అధ్యక్షులు దగ్గుబాటి సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులు అనుసృజన, నవకల్పన పట్ల అవగాహన, అభినివేశం కల్పించుకుని తమ చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించటానికి సాంకేతికత సహాయంతో మార్గాలను వెదికి కొత్త కొత్త మార్గాలను వెదకాలని, విజ్ఞానజ్యోతి సంస్థల విద్యార్థులకు తగిన సహాయసహకారాలు ఎప్పుడూ అందుతాయని తెలిపారు. నృత్యతరంగ్ శాస్త్రీయనృత్యకూటమి, క్రెసెండో సంగీత

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్‌రూరల్,ఏప్రిల్21,ప్రభాతవార్త: ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ జోడిమెట్ల చౌరస్తా వద్ద సోమవారం బీకేఆర్, కీర్తిశేషులు బద్దం కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి బుచ్చమ్మ, నర్సింహారెడ్డిల జ్ఞాపకార్థంతో ఏర్పాటు చేసినచలివేంద్రాన్ని సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో డైరక్టర్ బోయపల్లి సత్తిరెడ్డి, సామల సందీప్ రెడ్డి, బద్దం జగన్‌మోహన్ రెడ్డి, సామలకొండల్ రెడ్డి, బి. రాజేశ్వర్ రెడ్డి, ఆముదాల శ్రీశైలం, ప్రశాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో గ్రంథాలయం మంజూరు చేయండి



గ్రంథాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నందిగామ ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మండల కేంద్రమైన నందిగామలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి గారికి సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారితో కలిసిస్థానిక మండలనాయకులు వినతి పత్రం అందజేశారు. కొత్తగా మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నందిగామలో గ్రంథాలయ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ను కలిసిన వారిలో మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, చించేటి కృష్ణ గౌడ్, తడకల జంగయ్య స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్

దుద్యాల్,ఏప్రిల్ 21, ప్రభాతవార్త: ఆరుగాలం కష్టించి పండించిన పంటల ు అమ్ముకునే సమయంలో రైతులు ధాన్యం దళారులకు అమ్ముతుంటారని అలా అమ్ముకుని నష్టపోవద్దని కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలోపిఎసిఎస్ ఆధ్వర్యంలో వరికొ నుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు రైతు పండించిన పంటకు ధర ుఆశ చూపి తూకంలో మోసం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులకుఅండగా ప్రభుత్వం ముందస్తుగానే వరి కొ నుగోలు కేంద్రాల ు ఏర్పాటు చేసిందన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటాల్ రూ. 2,320, బి గ్రేడ్ వరి ధాన్యం క్వింటాల్ రూ. 2,300 లకు కొ నుగోలు చేస్తుందన్నారు. వరి కొ నుగోలు కేంద్రాల ు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భావన కొ నుగోలు కేంద్రాల నిర్వహకులు ఖలీల్ పాషా, ఖాజ, శ్రీశైలంగౌడ్, కృష్ణ, యూ ుస్, సీతారాంనాయక్, ముజీబ్, సత్య నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్పవృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న కల్పవృక్ష ఫౌండేషన్ నిర్వాహకులు

షాద్‌నగర్,ప్రభాతవార్త,ఏప్రిల్21 : షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో కల్పవృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని దాస కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా దాస కృష్ణయ్య మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం ఎంతో గొప్పదని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. ప్రతి సోమవారం దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు నాగిళ్ల కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కౌన్సిలరన రేటికల్ నందీశ్వర్, మల్లికార్జున్, ఆర్ఎన్‌రాజు, శ్రీనాథ్, పాండు, దేవదాస్, సుమంత్, మల్లేష్, క్రాంతికుమార్, దేవాలయ మేనేజర్‌రాజగోపాల్ పాల్గొన్నారు.

అద్భుతం మన కలయిక

దుద్యాల్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త:
దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామంలోని 2006-2007 ఎస్ఎస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారంరోజు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పురాతన కాలంలో నిర్మించిన ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగినభవనంలోతమబాల్యంజ్ఞాపకాలనునెమరవేసుకున్నారు. ఈ సంధర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. విద్యార్థులఐకమత్యం ఎంతగానో నచ్చిందని తమ ఆనందాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పిఈటీ సంఘం అధ్యక్షులు నిరంజన్, ఉపాధ్యాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానాలు

శామీర్‌పేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :
పొన్నాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గులాం మూర్తుజ పదవీ విరమణ చేయటంతో ఆయనను మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గులాం మూర్తుజ పదవీ విరమణ సన్మానసభ జరిగింది. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొని సన్మానించి అభినందించారు.

మండల విద్యా అధికారి కమలాకర్, పొన్నాల్ మాజీ సర్పంచు బి.సుకన్యసత్యనారాయణగౌడ్, మాజీ ఉపసర్పంచు గడ్డం రమేశ్, మాజీ ఎంపిటిసి సభ్యురాలు ఎం.మౌనికశివవీరప్రసాద్, మాజీ ఎంఇఓ వసంతకుమారి, ఎంపిపల్లి ఎంఇఓ భాగ్యమణి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హనుమంత్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు నర్సింగ్‌రావు, సుబ్బారావు, శ్రీనివాస్, ప్రభాకర్, ఉపాధ్యాయులు మహేశ్, గోపాల్, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, తిరుమలేశ్, కుమార్, రాజు, సురేందర్, గ్రామ మాజీ వార్డుసభ్యులు కలికోట ప్రభాకర్, కావలి రమేశ్, గ్రామనాయకులు మహేందర్, కృష్ణ, పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

గులాం మూర్తుజను ఘనంగా సన్మానించిన మాజీ ప్రజాప్రతినిధులు

గ్రామీణ ప్రాంతంలో కనుమరుగవుతున్న జీవవైవిధ్యం

వీధి కుక్కలు

నవాబుపేట,ఏప్రిల్20,ప్రభాతవార్త: జీవవైవిధ్యంరోజురోజుకు ప్రశ్నార్థక మవుతోంది. కొన్ని జీవరాశులు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాల మధ్య తిరుగాడే తోడేళ్ళు, నక్కలు మచ్చుకైనా కనిపించడంలేదు. రాత్రవుదంటే చాలు నక్కల కూతలు అడవి ప్రాంతంలో పోటాపోటీగా వినిపించేవి. ప్రస్తుతం దాదాపుగా వాటి ఉనికి కనిపించకుండా పోయింది. గ్రామీణ ప్రజలు నక్కలపై పుంకాను పుంకాలుగా కథలు చెప్పుకునే వారు నేడు వాటి ఊసేలేదు. ముద్దు పేరు నక్క బావగా వాటికీ ప్రజల్లో మంచి క్రేజీ ఉండేది. నక్కలతో పాటే వాటిపై అల్లుకున్న కథా కామీశు కూడా అంతరించి పోయాయి. నక్క బావ నేటితరానికీ చరిత్రగానే మిగిలింది. అదే విధంగాఅడవి గ్రామీణప్రాంతంలోమేకల పాలిట సింహ స్వప్న మైనా తోడేళ్ళుకూడాస్థానికంగా పూర్తిగా కనురుగైయ్యాయి. మేకలు ఓంటరిగా కనిపిస్తే చాలు అమాంతం వాటిపై విరుచుకుపడి చీల్చిఛండాడే తోడేళ్ళు సహితం ఇక్కడ కనుమరుగైయ్యాయి. వాటి స్థానంలో వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయి. గ్రామ సింహలుగా పిలువబడే కుక్కలు నేడు అడవి ప్రాంతంలోసంచరిస్తున్నాయి. అవి కుందేళ్ళ పాలిట యమపాశాలుగా మారాయి. గ్రామాలకంటే అధికంగా కుక్కలు అడవి ప్రాంతంలో కనిపించడం విశేషం. తోడేళ్ళు కనుమరుగవడంతో కుక్కలు అడవి ప్రాంతంలో సంచరించడం రివాజైయింది. వాటి ఆహారపు అలవాట్లు కూడా మారాయి. అడవిలో తిరుగాడే కుక్కలు పూర్తిస్థాయి మాంసహారిగా మారాయి. ప్రధానంగా కుందేళ్ళ వేటాడటం మొదలు పెట్టాయి. కుందేలు కనిపిస్తేచాలు ఆపూట పండగే అన్నఛందంగా వాటి జీవన విధానాన్ని మార్చుకున్నాయి.

ఈ నేపథ్యంలో కొన్ని పక్షుల సంఖ్య తగ్గుముఖం పటింది. సీతాకోక చిలుకలు, తేనెటీగలు రైతులు వాడే క్రిమిసంహాకర మందుల ప్రభావంతో వాటి సంఖ్య తగ్గుతోంది. నవంబర్, డిసెంబర్ మొదలుకోని జనవరి జనవరి మాసం వరకు తేనెటీగల ఉనికి అధికంగా ఉండేది. దట్టమైన పొదల్లో, గుబురుగా ఉండే చెట్లపై తేనెతుట్టెలు విరివిగా ఉండేవి. వాటి సంఖ్య తగ్గడంతో గ్రామీణప్రజలుస్వచ్ఛమైనాతేనెకుదూరమవుతున్నారు. పంటఎ ాలాలకు దూరంగా క్రిమిసంహారక మందుల ప్రభావం లేని ఆటవి ప్రాంతంలో తేనె తుట్టెలు లభిస్తునాయి. ఈ నేపథ్యంలో కొందరు సాహసంచేసి తేనె తుట్టెలను సేకరించి తేనె తీసి విక్రయించుకుంటున్నారు. దాదాపు 850 మి.లీ తేనె సీసా 500 నుండి 800 రూపాయలు పలుకుతోంది. ఈ విధంగా గ్రామాల్లో జీవవైవిద్యం రోజురోజుకు ప్రశ్నార్థకమవుతోంది. సహజ సిద్ధంగా ప్రకృతిలో ఉన్న సహజ జీవవైవిధ్య సంపద ధ్వంసమై భవిష్యత్తు భయాందోళనకు గురిచేస్తోంది.

పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

మొయినాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : మొయినాబాద్ మున్సిపాలీటిలో నేడు మంగళవారం అమ్డాపూర్, మూర్తుజగూడ, కాశింబౌలి, నజీబ్‌నగర్, గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు, మొయినాబాద్ మండల ఏఈఈ భానోతుహము తెలిపారు, మంగళవారం, ఆయన వార్త పత్రికతో మాట్లాడుతూ మూర్తుజగూడ, 11కేవి యోక్క సబ్‌స్టేషన్ నుండి సప్లై జరిగే విద్యుత్ తీగలకు చెట్ల కోమ్మలు పెరిగి, అడ్డుగా ఏర్పడి, వీస్తున్నటువంటి గాలులకు తగిలి ప్రజలకు నిత్యం విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకుఎలాంటిఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా అడ్డుగాఉన్నచెట్లకోమ్మలనుతోలగించివిద్యుత్‌తీగలనుసరిచేయాలని, మంగళ వారం సమయం విజయనవ్యా11 కెవి, ఉదయం10గంటల నుండి మధ్యహనం1గంటల వరకు, అమ్డాపూర్ 11కెవి. మధ్యహనం2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

షాబాద్,ఏప్రిల్21, ప్రభాతవార్త: మండలంలోని చిన్నసోలిపేట, పెద్దసోలిపేట, చందనవెల్లి గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. 11 కేవీ చందనవెల్లి పీడర్, 11 కేవీ సోలిపేట పీడర్ల పరిధిలో ఉన్న చెట్ల తొలగింపు కార్యక్రమంలో బాగంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజ్

చౌటకూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: మండల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం చౌటకూరులోని రైతు వేదికలో ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, సుందరయ్య, కె.జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా దుర్గారావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రాములు, సహాయ కార్యదర్శులుగా పవన్, పెంటయ్య, కోశాధికారిగా సత్తయ్య, కమిటి సభ్యులుగా చంద్రయ్య, మహేందర్, శంకరయ్య, లాజర్లను ఎన్నుకున్నారు.

నేడు బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా మేళా

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: ఈ నెల 22వ తేదీన జిల్లా లోని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సేవా మేళ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు ఆ శాఖ పిజిఎం రాజరాజేశ్వరి వెల్లడించారు. సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్డులోని జిఎం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు మేళా కొనసాగుతుందన్నారు. ఎస్ఎన్ఎల్ వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, బిల్లులు, సిగ్నల్ తదితర సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆర్ ఎన్ ఆర్ డెలవపర్స్ ఔదార్యం

తలకొండపల్లి,ఏప్రిల్ 21, ప్రభాత వార్త: ఇటీవల ఈనెల16న చుక్కాపూర్ గ్రామానికి చెందిన కొప్పుకిష్టమ్మ మరణించడం జరిగింది! అంత్య క్రియల సమయంలో వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం కుమారులు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి (ఆర్ఎన్ఆర్ డెవలపర్స్) (గౌరీ జువెలర్స్) ఏమి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తక్షణ సహాయం అంత్యక్రియల కోసం .. 5000/ రూపాయలు ఇవ్వడం జరిగింది. నేడు మరోసారి వారి కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని గమనించి సోమవారం ..25000/రూపాయలను కొప్పు కిష్టయ్యకు, వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది! ఇట్టి కార్యక్రమంలో స్వయంగా ఏమి రెడ్డి పాండురంగారెడ్డి విచ్చేసి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, మనో ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది! ఇట్టి కార్యక్రమంలో ఏమి రెడ్డి పాండురంగారెడ్డితో పాటు, ఏమి రెడ్డి రంగారెడ్డి, ఏమిరెడ్డి మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య, జర్నలిస్టు చంద్రకుమార్, కడారి పర్వతాలు, కడారి యాదయ్య, కొప్పు మల్లేష్, కొప్పు యాదయ్య, కొప్పు బాలేష్, మృతురాలి భర్త కొప్పుకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

తలకొండపల్లి,ఏప్రిల్ 21,ప్రభాతవార్త: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామపంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా ముత్యాల పుల్లా రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ నిన్న సాయంత్రం మరణించడం జరిగింది వారి అంత్యక్రియలకు ఆర్థిక సాయం కొరకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న 3000 రూపాయలు, చెన్నారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి 3000 రూపాయలు మొత్తం 6000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్ రెడ్డి మాజీ వార్డ్ నెంబర్స్ మల్యా నాయక్ మల్లయ్య జగన్మోహన్ రెడ్డి బుచ్చిరెడ్డి చందు ఎస్ కే బాబా మురళీమోహన్ రెడ్డి గోపాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పర్వతాలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
.కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వచ్చిన 106ధరఖాస్తులు
మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త

ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిశీలించి వాటిని పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజవాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగ ప్రజల నుంచి 106ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రజా సమస్యలను సత్వరం పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. సంబంధిత శాఖల వారు వెంటనే స్పందించి ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న వాటిని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఆర్జీలను పెట్టవద్దని ఆయన అధికారులను ఆదేశించారు. ో జిల్లా డిఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న డిఆర్ఓ హరిప్రియ

కల్తీ ఆహారంపై అవగాహన పెంచుకోవాలి

సిసిఐ నేషనల్ వైస్ ప్రసిడెంట్ చదలవాడ హరిబాబు
కల్తీ ఆహారంపై వినియోగాదారులకు అవగాహన సదస్సు

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాత వార్త : ప్రస్తుతం ప్రతి ఆహార పదార్థం ఎక్కువ శాతం కల్తీ అయ్యే అవకాశం ఉందని పట్టణ గ్రామీణ ప్రాంతాలోని ప్రజలు కల్తీ ఆహారంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సీసీఐ నేషనల్ వైస్ ప్రసిడెంట్ చదలవాడ హరిబాబు అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో అగ్మార్, సీసీఐ ఆధ్వర్యంలో కల్తీ ఆహారంపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు, వినియోగదారులకు కల్తీఆహారంపై అవగాన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం పిల్లలు తాగే పాల నుంచి టీ పోడి, కారం పొడి, పసుపు ఇలా ప్రతిదీ కల్తీమయంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ ఉంచిన మాంసంతో బిర్యానిలు తయారు చేస్తున్నారని, బాగా మరిగిన నూనెలతో వేపుడులు, బజ్జీలు వంటివి చేస్తున్నారని ఇలాంటి ఆహార పదార్థాలు తినడం వల్ల అనారోగ్య సమస్యల బారిన పడే పరిస్థితి నెలకొందని వారు అన్నారు. ఇకనైనా ప్రజలు, వినియోగదారులు కల్తీ ఆహార పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండి సరియైన ఆహార పదార్థాలు తీసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, డాక్టర్ వెంకన్నబాబు, సీసీఐ జనరల్ సెక్రటరీ సుప్రభ, అగ్‌మార్క్ డిపార్ట్‌మెంట్ చీఫ్ కమీషనర్ సుభాషిణి, జూనియర్ కెమిస్ట్ కుసుమ కుమారి, గ్రంథాలయ వైస్ చైర్మన్ నక్క బాల్‌రాజ్, వీరేష్, అయూబ్‌ఖాన్, సువర్ణ, మాధురి, గోపాల నారాయణ, సత్యనారాయణరెడ్డి, మల్లికార్జున్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సాంప్రదాయాలు తెలియపరచాలి

తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

జిల్లేడుచౌదరిగూడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త: నేటి తరం చిన్నారులకు పూర్వ కాల సాంప్రదాయాలను తప్పని సరిగా తెలియపరచాలని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని దక్షా పాఠశాల కరెస్పాండెంట్ రమేష్ అన్నారు. తమపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలపట్ల గౌరవం ఉండాలని ఎప్పటికప్పుడు వారిని చౌతన్య పరుస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే సోమవారం పాఠశాలలో తల్లిదండ్రులకు పాదాభివందనంకార్యక్రమాన్నినిర్వహించినట్లుఆయనపేర్కొన్నారు. విద్యార్థులకు తమ తల్లిదండ్రులకు పాదాబివందనం చేసి ఆశ్వీర్వాదం తీసు కున్నారు. వేదపండితుల మంత్రోత్సదారణల మద్యకార్యక్రమాన్ని జరుపు కున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ విశ్వనాథం, శ్రీదేవి, పుష్పలత, శిరీష, స్వాతి, లక్ష్మీబాయి, వాణి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న

పోషణ్ అభియాన్‌లో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళల

కొందుర్గు,ప్రభాతవార్త,ఏప్రిల్21: గర్భిణీస్త్రీలు, బాలింతలు, కిశోరబాలికలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జోత్స్న సూచించారు. సోమవారం మండల పరిధిలోని చెక్కలోనిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు ఆకు కూరలు, గుడ్లు, పాలు తీసుకోవాలని వివరించారు. అంగన్‌వాడీ టీచర్ గుండేటి భాగ్యమ్మ, ఆయా, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

హుస్సేన్‌పూర్‌లో బడిబాట కార్యక్రమం

హుస్సేన్‌పూర్‌లో బడిబాట కార్యక్రమం

కొడంగల్,ఏప్రిల్ 21ప్రభాతవార్త:
మండలపరిధిలోనిహుస్సేన్‌పూర్‌గ్రామంలోసోమవారంబడిబాట కార్యక్రమాన్నిచేపట్టారు. పాఠశాలప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్యగ్రామంలో ఇంటింటికి తిరుగుతు బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలోగల సదుపాయాలు, పాఠశాల ప్రత్యేకతలు వివరించారు .ఇంగ్లీషుమాద్యమంలోవిద్యాబోధన, విశాలమైన తరగతి గదులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత మధ్యాహ్నభోజనం, ఉచిత రెండు జతల స్కూల్ యూనిఫామ్స్ తదితరఅంశాలపై వివరిస్తు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చెర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు.

కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

కొడంగల్,ఏప్రిల్ 21ప్రభాతవార్త: కొడంగల్ మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 కమీషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ కొడంగల్ ప్రజల సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు 2025-26 సంవత్సరంలో 100 శాతం ఆస్తిపన్ను సాధిస్తానని కమీషనర్ పేర్కొన్నారు.

మాధురి సేవలు మరువలేనివి

తాండూరు టౌన్,

ఏప్రిల్21, పభాతవార్త:

ప్రధానోపాధ్యాయులు మాధురి సేవలు మరువలేనివని బీసీ కమీషన్ రాష్ట్రమాజీ సభ్యులు నూలి శుభప్రద్ పటేల్ అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలో ఆమే పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాన్ని మార్చడంలో ప్రధాన భూమికను పోషిస్తున్నారని కొనియాడారు. మాధురి టీచర్ తాండూరు నియోజకవర్గంలో నివివిధ పాఠశాలల్లోసమర్థవంతంగావిధుల ు నిర్వహించారని గుర్తుచేశారు. విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్ళేందుకు ఆమెచేసిన కృషి మరువలేనిదనిఅన్నారు. టియు నాయకులు, బందువులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, R.R DIST. AT: L.B. NAGAR.
SOP.NO. 11 OF 2025

Between
Pedditi Madhava Reddy & others ...Petitioners
And
Blue Yonder India Pvt.Ltd. Hyderabad Branch
2. All concerned ...Respondents

NOTICE

The petitioners have filed the above suit/Petition for grant of succession Certificate, in respect of the suit/Petition settle final duesamount of 77,66,243/- The Hon'ble court was pleased to order for publication of this Notice for your appearance in the above suit and the matter is posted to **23.04.2025 at 10:30 a.m.** and therefore you may appear before this Hon'ble court either in person or through your authorized counsel otherwise the matter will be adjudicated in due process of Law.

Late P. Srikanth Reddy is the son of petitioner No. 1 & 2, husband of petitioner No. 3 and father of Petitioner No. 4. late P. Srikant Reddy died on 09/09/2024 living behind the petitioner herein as legal hires. P.

అట్టహాసంగా లంకాదహన వేడుకలు .!

-ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్బీఓఎల్ సిఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్బీఓఎల్ సిఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, మార్చి 21, ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లా తాండూరులో శ్రీ భావిగి భద్రేశ్వర జాతర ఉత్సవాలలో రెండుప్రధాన ఘట్టాలైన రథోత్సవం, లంకాదహన వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. సోమవారం తెల్లవారుజాముల నిర్వహించిన లంకాదహన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 11గంటల నుంచి వేడుకలను ప్రారంభించారు. దేవాలయ రేనవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఆలయ ఈఓ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో భద్రేశ్వర దేవాలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం స్వామివారి పల్లకిసేవా ఊరెగింపుగా నిర్వహించారు. భక్తుల దివిటీల వెలుగులు, భజన కీర్తనలతో స్వామివారి పల్లకి సేవ దేవాలయం నుంచి భద్రేశ్వర దేవాలయం నుంచి ప్రారంభమై గాంధీచౌక్ జుమ్మా మసీద్, మురత్ దర్గా మీదుగా బసవణ్ణకట్ట వరకు నిర్వహించి లంకాదహన వేడుకలు నిర్వహించారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంకాదహన వేడుకలను ప్రారంభించారు. మరోవైపు పల్లకి సేవ ముందు కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు, వీరశైవ సమాజం, యువదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రయాణికుల వెతలు..

-మాజీ సర్పంచ్ సొంత ఖర్చులతో నిర్మిస్తున్న బస్టాండ్

సిడి తండ వద్ద నిర్మాణంలో ఉన్న బస్టాండ్ ప్రాంగణం

నందిగామ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జెపి దర్గాకి వెళ్లే సిడి తాండ జిపివద్ద మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్ తన తండ్రి కీర్తిశేషులు జటావత్ పూర్యానాయక్ జ్ఞాపకార్థం బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. సిడి తండాలో ఉన్న కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, గిరిజన ప్రజలు నిల్వ నీడ లేక ఎండలో ఎండుతూ.. వర్షంలో తడుస్తూ.. బస్సులు వచ్చేవరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ప్రయాణికుల, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మాజీ సర్పంచ్ ప్రత్యేక చొరవతో సొంత ఖర్చులు వెచ్చించి బస్టాండ్ నిర్మాణంచేయిస్తూ అన్నిహంగులతో నిర్మాణం వేగవంతం చేశారు. ఈసందర్భంగా ఇనుప పైపులను బిగించి రేకుల షెడ్డును వేయించి ప్రయాణికులు కూర్చునే విధంగా దిమ్మెలు ఏర్పాటుచేశారు. ఈప్రయాణ ప్రాంగణాన్ని త్వరలోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అభాగ్యులపాలిట ఆత్మబంధువుగా నిలిచిన మాజీ సర్పంచ్ రాజునాయక్ సేవలపట్ల ప్రయాణికులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అప్పాయిపల్లి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొడంగల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 19లో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణాలకు భూములు ఇచ్చిన రైతులకు పూర్తి సాయిలో నష్ట పరిహారం చెల్లించిన అనంతరం పనులు చేపట్టాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, రైతులు శేఖర్‌గౌడ్, పకీరప్ప, రాములుగౌడ్, అగ్గనూరు నర్సమ్మ, మోతిభాయి, వడ్డే శివమ్మ రవీంద్రమ్మ, సావిత్రమ్మ, కిష్టయ్య, బసప్ప తదితరులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు వారు సోమవారం కొడంగల్ తహశీల్దార్ విజయ్‌కుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పాయిపల్లిలో పోలీసులను పెట్టి బుల్డోజర్లతో చేస్తున్న పనులను వెంటనే అపాలని, ఇచ్చిన మాట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇస్తామన్నా నష్ట పరిహారం రూ.10లక్షలు ఇవ్వకుండా మధ్యలో ఉన్న కాంగ్రేస్ కార్యకర్తలతో కుమ్మకై సుమారు 70 నుంచి 80 లక్షల వరకు భూములు లేని వారికి, రికార్డులో లేనివారికి ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజ్యాంగ బద్ధంగా శాంతియుతంగా నిరసనలు తెలిపిరే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తు బలవంతంగా మా భూములను గుంజుకోవడం సరైంది కాదన్నారు. మెడికల్ కళాశాల నిర్మానానికి భూములు ఇచ్చిన నిజమైన రైతులకు నష్టపరిహారం చెల్లించాకనే పనులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని హమీ ఇవ్వడం జరిగిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జగదీశ్వర్

జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగ చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు జగదీశ్వర్‌లు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఇందిరమ్మ ఇళ్లకు సంబందించి 500మంది పేర్లు మొదటి విడతగ వచ్చినట్లు ఆయన పెర్కొన్నారు. ప్రభుత్వ నిభందనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఇలాకాలో రూ.200కోట్ల పనులు..అడుగు ముందుకు పడని వైనం

-ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి గ్రహణం



ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణానికి భూమిపూజ చేసి వదిలేసిన దృశ్యం

కొడంగల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంత గురుకులాను యూనివర్శిటీలను తలపించేలా గురుకుల పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామంటూ ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం శూన్యం అన్న చందంగా మారింది. కోట్లాది రూపాయలతో ఇంటిగ్రేటెడ్ మోడల్ గురుకుల పాఠశాల నిర్మాణం పనులను ఆర్భాటాలతో అదరగొడుతూ అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేసి నెలల తరబడి గడుస్తున్నా నేటికీ అడుగు ముందుకు పడడంలేదనడానికి కొడంగల్ నియోజక వర్గంలోని మున్సిపల్ పరిధిలోగల పాతకొడంగల్ గ్రామంలో మోడల్ గురుకుల పాఠశాల ఉదాహరణగా చెప్పవచ్చు. నాలుగునెలల క్రితం రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకులాలు, ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణం రాష్ట్రానికే మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దేందుకు భూమిపూజ చేశారు. తదనంతరం అధికారుల నిర్లక్ష్యమో లేక ప్రజాప్రతినిధుల అలసత్వమో తెలియదు కాని పనులు మాత్రం అడుగు ముందుకు పడడం లేదు. పాతకొడంగల్ శివారులో ప్రస్తుతం ఎస్టీ గురుకుల పాఠశాల కొనసాగుతున్న ప్రదేశంలోనే మొత్తం 20 ఎకరాల స్థల సేకరణ చేశారు. ఇందులో ఎస్సీ, బిసి, మైనార్టీ గురుకుల పాఠశాలలతోపాటు ఎస్టీ గురుకులాలు ఒకేవేదికలో (యూనివర్శిటీ) మాదిరిగా ఉండేలా అధికారులు డిజైన్ చేసి రూ.200కోట్లు కేటాయించారు. ఈ గురుకులాలకు నాలుగువైపులా బిటి రోడ్డు ఉండేలా నిర్మాణం చేపట్టేలా డిజైన్‌చేశారు. ఈ గురుకులాలకు సమీపంలోనే పెద్దచెర్వు ఉండడంతో మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందించేందుకు మరో రూ.45 కోట్లు మంజూరీచేశారు. మినీట్యాంక్‌బండ్ నిర్మాణానికి ఇటీవలే టెండర్లుసైతం పూర్తయ్యాయి. ఇదిలావుండగా గురుకులాల టెండర్ మొదటిది అనుకూలంగా లేకపోవడంతో ఇతరత్రా కారణాలతో రెండవదశ టెండర్ కొనసాగనున్నట్లు సమాచారం. ఈ గురుకుల పాఠశాలల నిర్మాణాలు పూర్తి అయితే కులమత భేదం లేకుండా అందరూ ఒకే వేదికపై ఉండేలా ప్రణాళికలు చేశారు. సువిశాలమైన అట స్థలం, పార్కులు, గ్రంథాలయాలు తదితర సుమారు రెండువేలమంది విద్యార్థులకు సరిపడేలా చేశారు. ఈపనులు కేవలం ఒక్క సంవత్సరంలోనే పూర్తిచేస్తామని చెప్పి నాలుగునెలల గడుస్తున్నా కనీసం తట్టెడుమట్టిని కూడా తీయలేదు. ప్రస్తుతం మైనార్టీ గురుకుల పాఠశాల చిలుములుమైలారం అద్దెభవనంలో కొనసాగుతుం డగా మరికొన్ని గురుకులాలు ఇతరత్రాప్రదేశాల్లో కొనసాగుతున్నాయి. 2026లో తరగతులు ప్రారంభిస్తామని చెబుతున్నా గడువులోపు పనులు పూర్తి అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. కాగా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి రెండువిడతల్లో టెండర్లు కొనసాగుతున్నాయని టెండర్లు పూర్తికాగానే పనులు శరవేగంగా కొనసాగిస్తామని ఈడబ్ల్యుఐడిఎస్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే డిజైన్ ఉండేలా కొంత డిజైన్ మార్పుకు ఆలస్యం జరిగిందని, ఒక్కసారి పనులు ప్రారంభిస్తే సంవత్సరంలోపు పూర్తిచేయడం జరుగుతుందని ఏఈ తెలిపారు.

వచ్చే విద్యాసంవత్సరానికి కెజిబివి పాఠశాల భవనం సిద్ధం

-మండల విద్యాధికారి చంద్రప్ప

పాఠశాల గదిని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి చంద్రప్ప

కోట్‌పల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

కోట్‌పల్లి మండలపరిధిలోని కరీంపూర్‌గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కెజిబివి పాఠశాల భవనం నిర్మాణపనులను సోమవారం మండల విద్యాధికారి చంద్రప్ప పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. 2025-26 నాటికి భవన నిర్మాణపనులు పూర్తిచేయాలని ఇంజనీర్ రామ్ కిషోర్‌కు పూచించారు. కెజిబివిభవనం 5ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారన్నారు. కెజిబివి భవనంలో 5తరగతిగదులు 3ల్యాబ్స్, 1లైబ్రెరీ, 8డార్మెటరీలు, 1స్టడీహాల్, 1కిచెన్, 1డైనింగ్‌హాల్, 1ఉపాధ్యాయులగది, 1ప్రిన్సిపాల్ గది, 1నర్సింగ్‌రూమ్, 1స్టోర్‌రూమ్‌లతోకలిపి మొత్తం 24గదులతో 2025-26, విద్యాసంవత్సరానికి అందించేందుకు పనులు కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ రామ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించిన మండల విద్యాధికారి చంద్రప్ప..

కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి, బార్వాద్‌తాండ, మద్గుల్‌తాండ శిథిలావ్యవస్థలో ఉన్నపాఠశాలలను సోమవారం మండలవిద్యాధికారి చంద్రప్ప పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. పాఠశాలగది శిథిలావస్థలో ఉండి స్లాబ్ పెచ్చులు ఊడిన పాఠశాల గదులను పరిశీలించి రెండు రోజుల్లో నివేదికను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి డానియెల్, ఇంజనీర్ జితేందర్, ప్రధానోపాధ్యాయులు రత్నకుమారి, విశ్వేశ్వర్, శారద, శ్రీనివాస్, అఖిల, శేఖర్, ప్రణయ్, శ్రీలక్ష్మి, తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఎస్.స్వాతిరెడ్డి

జడ్జి రాజ్యలక్ష్మీకి వీడ్కోలు పలుకుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా సేవలు అందిస్తున్న సిఎం రాజ్యలక్ష్మీ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సిద్దిపేట నుండి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి బదిలీపై వచ్చారు. జడ్జి రాజ్యలక్ష్మీ ఆదిలాబాద్‌కు బదిలీ అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా జడ్జి సిఎం రాజ్యలక్ష్మీకి న్యాయవాది కంచి రాజగోపాల్ తదితర జూనియర్ న్యాయవాదులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు లక్ష్మణ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధుల జంగయ్య

జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ఉపాధిహామీ కూలీలు, సిబ్బందికి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రం ఆర్య సమాజ్ ఆవరణలో తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లేడు చౌదరిగూడా మండల మహాసభ వి.భీమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ఎండలో పనులు చేస్తుంటే ప్రభుత్వానికి అధికారులకు కనికరం లేకుండా వ్యవహరించడం సరైనది కాదు అని ఆయన మండిపడ్డారు. ఉపాధి కూలీలకు 200 వందల రోజులు పనులు కల్పించాలని కొలతలతో సంబంధం లేకుండా 700రూపాయలు కూలివ్వాలి రవాణా సౌకర్యం కల్పించాలని అలాగే 8 వారాలుగా పెండింగ్లో ఉన్న బిల్స్ అన్ని విడుదల చేసి వెంటనే వారి అకౌంట్లో వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగింది గౌరవాధ్యక్షులుగా వి.భీమయ్య అధ్యక్షులుగా, కె.లింగం ఉపాధ్యక్షులుగా కె.రామచెంద్రి యాదమ్మ కార్యదర్శిగా ఎం.కృష్ణ, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, సురేష్ కోశాధికారిగా, పి.బాలులతోపాటు మరో ఏడుమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సమస్యలపై ఎంపిడివో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్ర మంలో రైతుసంఘం నాయకులు బాల్ రాజ్ జంగయ్య, నర్సమ్మ, సునీత, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరేశం, పాపయ్య, ఉపాధికూలీలు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన విదేశీ విద్య

-ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

క్రిస్ జాన్సన్‌కు మొమెంటో అందజేస్తున్న సెక్రటరీ నీలిమ, ఎమ్మెల్యే పి.రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

అనురాగ్ విశ్వవిద్యాలయంతో ఆరిజోనా విశ్వవిద్యాలయం మధ్య కుదిరిన ఒప్పందం తక్కువ ఖర్చుతో ఉన్నత నాణ్యత కల్గిన అంతర్జాతీయ విద్యను అందించాలనే మా సంకల్పం ప్రతిబింబిస్తుందని ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో అరిజోనా స్టేట్ యూనివర్శిటీతో అనురాగ్ యూనివర్శిటీ ప్రతినిధుల మధ్యన భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. భాగస్వామ్య ఒప్పందం ద్వారా కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ వ్యాపారం, మేనేజ్‌మెంటు వంటి రంగాల్లో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీలు పొందే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌యూ గ్లోబల్ పార్టనర్‌షిప్ డెవలప్‌మెంటు సీనియర్ డైరక్టర్ క్రిస్ జాన్సన్, కళాశాల సెక్రటరీ పల్లా నీలిమ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దశ మారుతున్న కొత్తూర్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

కొత్తూర్ మున్సిపాలిటీకి దశదిశ మారబోతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో టియుఎఫ్ఐడిసి నిధులతో రూ.1 కోటి వ్యయంతో సుమారు కిలోమీటర్‌మేర కొత్తూర్ పెంజర్ల బైపాస్ రోడ్డు నుండి కస్తూర్బా హాస్టల్ వరకు నిర్మించనున్న సిసి రోడ్డుకు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ సోమ్లనాయక్, కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్‌తో కలిసి సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తామని, ముఖ్యంగా రోడ్లు, అండర్ డ్రైనేజ్ మున్సిపాలిటీ అభివృద్ధి కావాల్సినటువంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అభివృద్ధిపనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కొత్తూర్ మున్సిపాలిటీ తండాలలో పర్యటించిన ఎమ్మెల్యే....

కొత్తూర్ మున్సిపాలిటీపరిధిలోని 4వవార్డు తండాలలో అండర్‌డ్రైనేజ్ లేక ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్న తండా వాసులు మురుగునీరు తాండ నుండి పక్కన ఉన్న పంటపొలాలకుచేరి పంటలు దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే స్థానికుల బైక్‌పై తండాకు చేరుకుని పరిసరాలను సందర్శించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజ్ పనులను అతి తొందరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో తాండవాసులు ఎమ్మెల్యేకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మెన్ డోలి రవీందర్, మాజీ ఎంపిపి వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు బండారి భరత్‌గౌడ్, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటిసిలు కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు ఎమ్మె సత్తయ్య, ఆంజనేయులుగౌడ్, బ్యాగరి యాదయ్య, ఇందూరి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నందిగామమండల అధ్యక్షుడు జంగా నరసింహ, నవీన్‌చారి, శివగౌడ్, జగన్‌గౌడ్, గోవింద్‌నాయక్, చిల్కమర్రి నరసింహ, చింత సాయి తేజేశ్వర్, పాశం కృష్ణ, యాదయ్య, తుప్పర బాలరాజ్, శ్రీనునాయక్, నాయకులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి..

-మండల విద్యాధికారి లక్ష్మణ్

షాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం చేయాలని మండల విద్యాధికారి లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి గురుకుల పరీక్షలో జిలాస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని అలాగే విద్యార్థులకు కావాల్సిన యూనిఫామ్ పాఠ్యపుస్తకాలు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సునితరామస్వామి, మద్దూరి శకుంతల పాండు, మద్దూరి మల్లేష్, పాల్గొన్నారు.

విజ్ఞానానికి వేదిక గ్రంథాలయం..

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

యువత భవిష్యత్తుకు వెలుగు చూపేది గ్రంథాలయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో రూ.75లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. గ్రంథాలయాన్ని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధు, స్థానిక కౌన్సిలర్ అనితశ్రీనివాస్‌గౌడ్, సాన్నిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థుల భవిష్యత్తు, యువతలో మార్పు కేవలం మంచి పుస్తకాల్లోనే ఉందని, ఇలాంటి గ్రంథాలయాలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. చదువులో ఆసక్తి పెరిగేలా, విజ్ఞానాన్ని విస్తరించుకునేలా విద్యార్థులు ఈగ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ కొత్త గ్రంథాలయాన్ని ఎంతో హర్షంగా స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మెన్ డోలి రవీందర్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బండారి భరత్‌గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటిసిలు కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు ఎమ్మె సత్తయ్య, ఆంజనేయులుగౌడ్, బ్యాగరి యాదయ్య, ఇందూరి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నందిగామమండల అధ్యక్షుడు జంగా నరసింహ, నవీన్‌చారి, శివగౌడ్, జగన్‌గౌడ్, గోవింద్‌నాయక్, చిల్కమర్రి నరసింహ, చింతసాయితేజేశ్వర్, పాశం కృష్ణ, యాదయ్య, తుప్పర బాల్‌రాజ్, శ్రీనునాయక్, నాయకులు ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో తల్లీకూతుళ్లు అదృశ్యం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:

ఇంట్లో భర్తతో గొడవ పడిన భార్య ఇద్దరు కూతుళ్లను తీసుకొని వెళ్లిపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ సమీపంలోని నివాసం ఉంటున్న పొదలి నాగరాజు భార్య లావణ్య (33), కూతుళ్లు శ్రావణి (14), మేఘన (13)లు సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయారు. భర్త నాగరాజుతో గొడవ జరుగగా అతను ఇంట్లో లేని సమయంలో లావణ్య ఇద్దరు కూతుళ్లతో కలిసి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. లావణ్య భార్య కూతుళ్ల ఆచూకి కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ముగ్గురు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

భూభారతిపై అవగాహన సదస్సు

-హాజరుకానున్న ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

కంగ్టి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: ఈ నెల 22న మండలంలోని తడ్కల్ గ్రామంలోని దేవి ఫంక్షన్‌హాల్‌లో భూభారతి-2025 చట్టంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి పేర్కొన్నారు. సోమ వారం కంగ్టిలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌డిఓ తహసీల్దార్ భాస్కర్ తో కలిసి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్ర